ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.27, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 55, పచ్చి మిర్చి 70, బజ్జీమిర్చి 70, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 35, పందిరి బీర 38, క్యాబేజీ 18, క్యారెట్ 37, దొండ 28, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 75, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 26, మొరంగడ్డ 25, కందగడ్డ 40, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

రాష్ట్రపతి నిలయంలో సీపీఆర్‌పై శిక్షణ



బొల్లారం: బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఉస్మానియా మెడికల్ కాలేజ్ సహకారంతో విద్యార్థులకు రెండు రోజుల పాటు సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్ పై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 28 పాఠశాలల నుండి 1,200 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉస్మానియా జనరల్ – చెస్ట్ హాస్పిటల్ కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగం హెడ్ డా. అనిత భల్లా పాల్గొన్నారు.

ఘనంగా ఘటం ఊరేగింపు



సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని శ్రీరామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన శ్రీభూలక్ష్మీ అమ్మవారి ఘటం ఊరేగింపు కన్నులపండువగా జరిగింది. ఆలయ ధర్మకర్త విశాల్ సూదం ఆధ్వర్యంలో వరుసగా రెండో ఏడాది ఘటం ఊరేగింపు సంప్రదాయం కొనసాగింది. ప్రకాష్‌నగర్‌లోని వీధివీధినా ఘటాన్ని ఊరేగించారు. అమ్మవారి ఘటానికి భక్తులు అపూర్వ స్వాగతం పలికారు. మధ్యాహ్నం ప్రారంభమైన ఊరేగింపు అన్ని వీధుల్లో కొనసాగి రాత్రికి అమ్మవారి ఆలయ సన్నిధికి చేరుకుంది.

సందడిగా గోరింటాకు వేడుక



సనత్‌నగర్: ఆషాఢ మాసం అంటే బోనాలు..ఆ తర్వాత గోరింటాకు గుర్తుకువస్తుంది. ఇప్పుడు గోరింటాకు పెట్టుకునే కార్యక్రమాన్ని వేడుకగా జరుపుకున్నారు జెకెకాలనీ విజయ గ్రాండ్యువర్ అపార్ట్‌మెంట్ మహిళలు. అపార్ట్‌మెంట్ మహిళలంతా ఒక చోట చేరి గోరింటాకు పెట్టుకుని మురిసిపోయారు. గోరింటాకు వేడుక కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.అన్నపూర్ణ, లంకా హైమావతి, హరిత, కళ్యాణి, గీత, రజని, సాయిలక్ష్మీ, రాధ, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



లాలాపేట: మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ వహించాలని జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధి వెంకటనారాయణ అన్నారు. శనివారం లాలాపేట వినోభానగర్‌లోని రెయిన్ బో హోమ్‌లో కిమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కిమ్స్ వైద్యులు దాదాపు 150 మందికి వైద్య సేవలను అందించారు. రెయిన్‌బో హోమ్ సిటీ మెనేజర్ క్రాంతి కిరణ్, బ్లూ ఫౌండేషన్ డైరెక్టర్ వి. క్రాంతి కిషోర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరించండి



సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని స్థానిక కార్పొరేటర్ సామల హేమ కోరారు. ఈ మేరకు శనివారం జలమండలి జనరల్ మేనేజర్ వినోద్ కుమార్‌తో సమావేశమైన కార్పొరేటర్ సామల హేమ డివిజన్ సమస్యలు వివరించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరా సరిగ్గా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని చెప్పారు.

బోనాల జాతరకు సర్వం సిద్ధం

నేడు కట్టమైసమ్మ బోనాలు.. రేపు రంగం



చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయం



చిలకలగూడ ప్రధాన రహదారిలో అలంకరణ..

- సర్వాంగసుందరంగా ముస్తాబైన అమ్మవారి ఆలయాలు
- సుమారు లక్ష మంది భక్తులు హాజరవుతారని అంచనా



కట్టమైసమ్మ



నల్లపోచమ్మ

చిలకలగూడ: చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ బోనాల జాతర వేడుకలకు సర్వం సిద్ధమైంది. పుష్పాలు, విద్యుత్‌దీపాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టారు. సుమారు లక్ష మంది భక్తులు వేడుకల్లో పాల్గొంటారని అంచనా. శనివారం సాయంత్రం కానుగుల వంశీయులు సమర్పించిన మైలబోనంతో జాతర సందడి మొదలైంది. బోనంతో వచ్చేవారికి, మహిళలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని ఆలయ ఈఓ మహేందర్ గౌడ్, ఫెస్టివల్ కమిటీ చైర్మన్ గుంటికృష్ణలు తెలిపారు. ఆదివారం బోనాలు, ఫలహారంబళ్లు, తొట్టెల ఊరేగింపు, సోమవారం భవిష్యవాణి వినిపించే రంగం కార్యక్రమం నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ ప్రజల తరపున సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి ఆదేశాల మేరకు కట్టమైసమ్మ బోనాల జాతరకు పటిష్టమైన బందోస్తు ఏర్పాట్లు చేపట్టామని చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్ తెలిపారు.
– అనుదీప్, చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ

బోనాల సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

బోనాల జాతర సందర్భంగా చిలకలగూడ ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిపి వేయనున్నట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. బస్సులు, హెవీ వెహికల్స్‌ను చిలకలగూడ క్రాస్ రోడ్, సీతాఫల్‌మండి ఫ్లైఓవర్ల నుంచి దారి మళ్లిస్తామన్నారు సికింద్రాబాద్ నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలను చిలకలగూడ పోలీస్‌స్టేషన్ వెనుక నుంచి మైలార్‌గడ్డ మీదుగా నామాలగుండుకు చేరుకునే విధంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టామన్నారు. వారాసిగూడ నుంచి వచ్చే వాహనాలను నామాలగుండు, నెహ్రూ స్కూలుగల్లీ, బడేమసీదు మీదుగా చిలకలగూడ అమర్‌టాకీస్‌కు చేరుకుంటాయి. మున్సిపల్ మైదానాన్ని వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తామన్నారు.
– శ్రీనివాసులు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

క్రేన్ ఇన్‌చార్జిని సత్కరించిన ఏసీపీ



అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళకు ప్రథమ చికిత్స అందించి తన మానవత్వాన్ని చాటుకున్న బేగంపేట క్రేన్–4 ఇన్‌ఛార్జి అశోక్‌రెడ్డిని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు శనివారం సన్మానించారు. బేగంపేట హెచ్‌పీఎస్ అవుట్‌గేటు వద్ద ఓ మహిళా డాక్టర్ ఈ నెల 17న సాయంత్రం రసూల్‌పురా వైపు వెళ్తుండగా గుర్తుతెలియని ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టి వెళ్లిపోయాడు. ఈ ఘటనలో ఆమె కుడి కాలుకు గాయమై తీవ్ర రక్త స్రావం జరిగింది. దీనిని గమనించిన అశోక్‌రెడ్డి ప్రథమ చికిత్స కిట్ ద్వారా వెంటనే బాధిత మహిళా డాక్టర్‌కు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం ఆమెను మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. వెంటనే అప్రమత్తమై ప్రథమ చికిత్స సేవలు అందించిన అశోక్‌రెడ్డిని నార్త్‌జోన్ ఏసీపీ శంకర్‌రాజు, బేగంపేట ఇన్‌స్పెక్టర్ జానకిరాములు శాలువాతో సత్కరించారు.

వరద రాకుండా చర్యలు

రసూల్‌పురా: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నాలా వరద ప్యాట్నీనగర్ నివాస ప్రాంతాల్లోకి రాకుండా హెచ్‌ఎండీఏ అధికారులు శనివారం తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారు. ప్యాట్నీ నాలా కబ్జాలకు గురవడంతో నాలా విస్తరణ పనులు హెచ్‌ఎండీఏ చేపట్టింది. స్థానికంగా నివాసం ఉంటున్న అశోక్ ప్యాట్నీ కుటుంబ సభ్యులు కోర్టును ఆశ్రయించడంతో నాలా విస్తరణ పనులు నిలిచిపోయాయి. దీంతో నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణంలో జాప్యం కావడంతో శుక్రవారం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి ప్యాట్నీనగర్ లోకి వరద ముంచెత్తడంతో హైడ్రా సహాయక చర్యలు చేపట్టి ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహాయంతో పలువురిని బోట్లల్లో కాలనీ వెలుపలికి పంపించారు. తాత్కాలికంగా సంచుల్లో ఇసుక మట్టి నింపి అడ్డుకట్ట వేశారు.





ప్యాట్నీ నాలా వద్ద తాత్కాలికంగా అడ్డుకట్ట వేస్తున్న దృశ్యం

సమస్యలు పరిష్కరించండి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న అడ్డగుట్ట బీజేపీ నేతలు

అడ్డగుట్ట: డివిజన్‌లో సమస్యలను పరిష్కరించాలని అడ్డగుట్ట బీజేపీ అధ్యక్షురాలు గాజుల సౌందర్య శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సౌందర్య మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం సి సెక్షన్ నుండి పహాడీ హనుమాను దేవాలయం వరకు నూతన రోడ్డు నిర్మించాలని, ఈ విషయమై రైల్వే జనరల్ మేనేజర్‌తో మాట్లాడి పని పూర్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థుల బోనాల వేడుక



బౌద్ధనగర్: బోనాల జాతరను పురస్కరించుకొని బౌద్ధనగర్ డివిజన్ వారాసిగూడలోని అపోలో గ్రామర్ హైస్కూల్‌లో శనివారం వేడుకలు నిర్వహించారు. విద్యార్థిని బోనాలు ఎత్తుకోగా, విద్యార్థులు పోతురాజుల వేషధారణ వేసుకొని ఆటపాటల నడుమ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మంచాల రఘు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



అజయ్

అడ్డగుట్ట: పనిపై వెళ్తున్నానని చెప్పి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. తుకారాంగేట్ ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపిన మేరకు.. ఈస్ట్‌మారేడుపల్లిలోని టీచర్స్ కాలనీకి చెందిన అజయ్(45) పనిపై కర్నూలు వెళ్లేసి వస్తానని భార్యకు చెప్పి వెళ్లాడు. రోజులు గడుస్తున్నా తిరిగిరాలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తెలిసిన వారి వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో భార్య సుస్మిత శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మానసికస్థితి సరిగాలేని వ్యక్తి అదృశ్యం

అడ్డగుట్ట: మానసికస్థితి సరిగాలేని ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు.తుకారాంగేట్ ఎస్ఐ తెలిపిన మేరకు.. ఎంసీహెచ్ క్వార్టర్స్‌కు చెందిన హరిదర్శన్(42)కు మానసికస్థితి సరిగాలేదు. నిత్యం కల్లు తాగేవాడు. ఈ నెల 17న రాత్రి సమయంలో ఇంట్లో గొడవపడి బయటకు వెళ్లిన హరిదర్శన్ ఇంటికి మళ్లీ తిరిగిరాలేదు.కుటుంబసభ్యులు తమకు తెలిసిన వారిని వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో శనివారం తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గత పాలకుల నిర్లక్ష్యం వల్లే ముంపు సమస్య



రామన్నకుంట పరిసర ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: గత పాలకుల నిర్లక్ష్యం వల్లే రామన్నకుంట పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. శనివారం ఆరో వార్డు పరిధిలోని రామన్నకుంట పరిసర ప్రాంతాలైన మర్రి రాంరెడ్డి కాలనీ, సీతారాంపురం, భారతీ ఎవెన్యూల్లో శుక్రవారం కురిసిన భారీవర్షానికి ముంపునకు గురవడంతో ఎమ్మెల్యే శ్రీగణేష్ పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోర్డు అధికారులతో మాట్లాడి వర్షపునీటిని, పేరుకపోయిన బురదను ఎప్పటికప్పుడు ఎత్తిపోసే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్ పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు రండి..

సనత్‌నగర్: బోనాల ఉత్సవాలకు రారండి అంటూ మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు చిలకలగూడలోని కట్టమైసమ్మ ఆలయ నిర్వాహకులు ఆహ్వానం అందజేశారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను శనివారం ఆలయ చైర్మన్ గుంటి కృష్ణ, ఈఓ మహేందర్‌గౌడ్‌లు కలిసి ఆహ్వానాన్ని అందజేశారు.

పీహెచ్‌డీ ప్రవేశాలలో వర్గీకరణను అమలు చేయాలి



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాలలో ఎస్సీ రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయాలని ఎంఎస్ఎఫ్ తెలంగాణ అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్‌మాదిగ డిమాండ్ చేశారు. శనివారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణ అమలులో జరుగుతున్న కుట్రలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలన్నారు. ఓయూలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలులో మాదిగ ప్రొఫెసర్లు మౌనం వీడాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నాయకులు చిరంజీవిమాదిగ, పరుశురాంమాదిగ, అజయ్‌మాదిగ, మంద రాజు మాదిగ పాల్గొన్నారు.

ఓయూలో బీఆర్ఎస్వీ నేతల అరెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి లాలాగూడ, నల్లకుంట పోలీస్ స్టేషన్లకు తరలించారు. శనివారం బనకచర్ల ప్రాజెక్టు, ఏపీ ప్రభుత్వం అక్రమ నీటి దోపిడీని విద్యార్థులకు వివరిస్తుండగా పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేసినట్లు బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షులు తుంగ బాలు తెలిపారు.

లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన డిప్యూటీ మేయర్

లాలాపేట: తార్నాక మున్సిల్ డివిజన్ పరిధిలో శనివారం వర్షం దంచికొట్టింది. తార్నాక, లాలాపేట, శాంతినగర్ తదితర ప్రాంతాలు చెరువులను తలపించాయి. వరద తాకిడికి రోడ్లు గుంతలు పడ్డాయి. ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇందిరానగర్, సత్యానగర్, లక్ష్మీనగర్ లోతట్టు ప్రాంతాల్లో శనివారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



లాలాపేట ఇందిరానగర్‌లో..



లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న డిప్యూటీ మేయర్.శ్రీలతశోభన్‌రెడ్డి

బాక్సింగ్ క్లబ్ సభ్యులకు బంగారు పతకాలు



సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి ఆర్యసమాజం బాక్సింగ్ క్లబ్‌కు చెందిన పలువురు బాక్సర్లకు మేడిబావి బాక్సింగ్ క్లబ్ మెంబర్లు బహుమతులు చేజిక్కించుకున్నారు. ఈనెల 18,19 తేదీల్లో షేక్‌పేటలోని జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న మేడిబావి బాక్సర్లు 35 కేజీల విభాగంలో ఏ.ప్రణీత్, 46 కేజీల విభాగంలో డి.శంకు బంగారు పతకాలు గెలుచుకున్నారు. 37 కేజీల విభాగంలా కే.తుల్సి కాంస్య పతకాన్ని గెల్చుకున్నట్టు బాక్సింగ్ కోచ్ రాజేశ్ తెలిపారు.

కార్ఖానాలో పర్యటించిన బీజేపీ నేతలు



బియ్యం, పప్పుదినుసులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

రసూల్‌పురా: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన కార్ఖాన బస్తీలో బీజేపీ నాయకులు శనివారం పర్యటించారు. బీజేపీ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నారాయణ స్వామి టెంపుల్ ఏరియా, ముస్లీం బస్తీల్లో ఇంటింటికి తిరిగి బియ్యం, పప్పుదినుసులు, కూరగాయలను స్థానికులకు పంపిణీచేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు అరుణ్, ఖలీం, మహిళ నాయకులు విజయలక్ష్మి, సబిత, రేఖ పాల్గొన్నారు.

మూలం సంతను ఆదరించాలి



మూలం సంతలో పాల్గొన్న దత్త పీఠాధిపతులు స్వామి రామానంద ప్రభుజీ

లాలాపేట: గో వ్యవసాయాధారిత వస్తువులతో నిర్వహిస్తున్న 'మూలం సంత'ను ప్రజలందరూ ఆదరించాలని శ్రీ సాయి దత్త పీఠాధిపతులు స్వామి రామానంద ప్రభుజీ అన్నారు. తార్నాకలోని మర్రి కృష్ణా హాల్లో శనివారం గ్రామభారతి, సిఎస్ఆర్ మెమోరియల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 13వ మూలం సంత విజయవంతమైంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి గోఆధారిత, వ్యవసాయ, చేతి వృత్తుల వస్తువులతో దాదాపు 70కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. దీనికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి స్వామి రామానంద ప్రభుజీ విశిష్ట అతిథిగా హాజరయ్యారు.

తపాలాశాఖలో 'ఐటీ 2.0' సేవలు

సాక్షి,సిటీ బ్యూరో: నగరంలో వినియోగదారులకు మరింత వేగవంతమైన సేవలందించేందుకు ఆధునిక తపాలా సాంకేతికత 'ఐటీ 2.0' ని ప్రవేశపెడుతున్నట్లు సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఏ.సుబ్రహ్మణ్యం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర తపాలా శాఖ సర్కిల్, రీజినల్ కార్యాలయాల ఆదేశాల మేరకు సికింద్రాబాద్ డివిజన్ లో ఈనెల 22వ తేదీ నుంచి ఈ సేవలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. 21న డివిజన్ పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాల్లో ఎలాంటి లావాదేవీలు జరగవని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సికింద్రాబాద్ ఎస్సీ సెల్ కార్యవర్గం ఎన్నిక



సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీ సెల్ కొత్త కార్యవర్గాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ ప్రకటించారు. ఎస్సీసెల్ చైర్మన్‌గా ఈ.నవీన్‌కుమార్, వైస్ చైర్మన్లుగా బి.వినోద్, జి.దుర్గాప్రసాద్, నిర్వాహక కార్యదర్శిగా ఈఏ.అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.గుణకర్, ఉప్పరి రఘు, ఏ.ఆనంద్, జనార్ధన్‌బాబు, కార్యవర్గ సభ్యుడిగా గుంటి మహేష్‌బాబు నియమితులయ్యారు.